క్లుప్తంగా

పలమనేరులో అడ్మిషన్ డ్రైవ్


కార్యక్రమంలో పాల్గొన్న గంటావూరు ఉపాధ్యాయులు

పలమనేరు: పట్టణంలోని గంటావూరు ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు, ప్రభుత్వం నుంచి పిల్లలకు అందే లబ్ధిని వివరించారు. పలువురు తల్లిదండ్రులు ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అడ్మిషన్ పొందారు. హెచ్‌ఎం మునాఫ్, టీచర్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం


వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ ఎల్లప్ప

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె, అమ్మగారిపల్లె సచివాలయాల్లో బుధవారం వలంటీర్లను సన్మానించారు. వలంటీర్ల సేవ అభినందనీయమని ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. మరింతగా సేవలు అందించి అందరి అభిమానం చూరగొనాలని సూచించారు. కార్యక్రమాల్లో సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, డాక్టరు గిరీషా, సర్పంచ్‌లు ఐశ్వర్య, వరలక్ష్మి, సీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ అభివృద్ధికి కృషి


ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె ఎస్సీ బాలుర హాస్టల్ అభివృద్ధి కోసం కృషి చేస్తామని జెడ్పీటీసీ మల్లిక రంగనాథం తెలిపారు. బుధవారం ఆమె హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలు కొన్ని సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించి వెంటనే నాలుగు సీలింగ్ ఫ్యాన్లు, నాలుగు ట్యూబ్‌లైట్లను తెప్పించి వితరణగా అందించారు. హాస్టల్‌కు సంబంధించి మరే సమస్యలున్నా పరిష్కరిస్తానని ఆమె తెలిపారు. ఎంపీడీవో విద్యాసాగర్, వార్డెన్ శీనప్ప, పంచాయతీ సెక్రటరీ భాస్కర్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



పలమనేరు: పెద్దపంజాణి మండలం చిన్నేపల్లెకు చెందిన ఓ గర్భిణి బుధవారం 108 వాహనంలో ప్రసవించింది. తహసీనా నిండు గర్భిణి. ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేశారు. సిబ్బంది అక్కడికి చేరుకుని 108 వాహనంలో ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆమెకు రక్తపోటు ఎక్కువ కావడంతో ఇక్కడి వైద్యులు చిత్తూరు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ జగదీష్ వాహనాన్ని రోడ్డు పక్కగా ఆపారు. ఆమె కుటుంబ సభ్యుల సాయంతో సుఖప్రసవం చేయించారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు వారు తెలిపారు. అనంతరం ఆమెను ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బందికి తహసీనా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం


ర్యాలీలో వైద్య విద్యార్థులు

గుడుపల్లె: యువత రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడాలని పీఈఎస్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రమాదాలలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో కొట్టు మిట్టాడుతున్న వారికి రక్తాన్ని ఇచ్చి కాపాడాలన్నారు.

ఘనంగా గంగజాతర


ప్రత్యేకాలంకరణలో గంగమ్మ

సోమల: మండల కేంద్రంలో బుధవారం గంగజాతర ఘనంగా జరిగింది. అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి శివాలయం వద్ద కొలువు దీర్చారు. పరిమళ భరిత పుష్పమాలికలు, పట్టుపీతాంబరాలతో సుందరంగా అలంకరించి పూజలు చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు పిండి దీపాలతో వచ్చి మొక్కులు చెల్లించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. రాత్రి జలధితో జాతర పరిసమాప్తమైంది.

తల్లిదండ్రుల కళ్లలో విద్యానందం


పలమనేరు : టి.వడ్డూరులో కిట్ల పంపిణీ


బైరెడ్డిపల్లె : పాతపేటలో కిట్ల పంపిణీ

పలమనేరు: బడులు తెరచుకుంటున్నాయంటే విద్యాసామాగ్రి కోసం ఇబ్బందులు లేకుండా అన్నింటినీ ప్రభుత్వమే పంపిణీ చేసి తల్లిదండ్రుల కళ్లలో ఆనందం నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పలమనేరు మండలంలోని పలువురు సర్పంచులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని టి.వడ్డూరు, కరిడిమొడుగు పంచాయతీల్లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ ఆయా హెచ్‌ఎం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా సర్పంచులు మునస్వామి, హంసవేణి మాట్లాడుతూ గతంలో పిల్లలను బడికి పంపడం పెద్దకష్టంగా ఉండేదన్నారు.

యూనిఫామ్ లేక పిల్లలను బయట నిలబెట్టే సందర్భాలు అందరికీ తెలిసిందేనన్నారు. నేటి జగనన్న పాలనలో ఏడు రకాల విద్యా వస్తువులతో పాటు, పౌష్టికాహారం, పిల్లల చదువుకోసం ఆర్థికసాయాన్ని అందిచడం ప్రజల అదృష్టమని తెలిపారు. మున్సిపాలిటిలోని బొమ్మిదొడ్డి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పిల్లలకు వార్డు కౌన్సిలర్ శ్రీలక్ష్మి విద్యాకానుకల కిట్లను పంపిణీ చేశారు. రాగి జావను పిల్లలకు అందించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు కేశవులు, రజాక్, హరిగోవిందయ్య, సంబంధిత పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్లు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

సోమల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎంపీపీ ఈశ్వరయ్య తెలిపారు. కందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఆర్‌బీకే చైర్మన్ వెంకటేష్, వైస్ ఎంపీపీ సయ్యద్‌బాషా, స్కూల్ కమిటీ చైర్మన్ సురేష్‌రెడ్డి, సర్పంచ్ బాషా మసూద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ

రామకుప్పం: మండలంలోని అయ్యప్పగానిపల్లె ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఎంపీపీ సుబ్రమణ్యం విద్యాకానుక అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు తెరచిన వెంటనే విద్యార్థులకు తమ ప్రభుత్వం జగనన్న విద్యాకానుకగా అందజేస్తున్నట్లు తెలిపారు. దేశంలో విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని పేర్కొన్నారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

బైరెడ్డిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప పేర్కొన్నారు. మండలంలోని కడపనత్తం, పాతపేట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు కోసమే సీఎం జగనన్న విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెడల్ స్కూల్‌లో

గుడుపల్లె: మండలంలోని మెడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 383 మంది విద్యార్థులకు జగననన్న విద్యా కానుకను జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి అందించారు. జగనన్న ప్రభుత్వంలో విద్యార్థులకు కావాలసిన సదుపాయాలు ప్రతి ప్రభుత్వ స్కూల్లో ఉందన్నారు.ఎంఈవో శ్రీదేవి, ఈవోపీఆర్‌డీ శంకర్, ప్రిన్సిపాల్ భువనేశ్వరి పాల్గొన్నారు.


పలమనేరు : సంబార్‌పూర్‌లో..

ప్రైవేటుకు దీటుగా..

కుప్పంరూరల్: మండల పరిధిలోని లక్ష్మీపురంలో బుధవారం విద్యా కానుక సామాగ్రి పంపిణీ చేశారు. అతిథిగా విచ్చేసిన 25వ వార్డు కౌన్సిలర్ మంజులమ్మ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు దీటుగా తయారయ్యాయని చెప్పారు. తల్లిదండ్రులు సైతం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ఉపాధ్యాయులు అమరజ్యోతి, నాయకులు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.


గుడుపల్లె మోడల్ స్కూల్‌లో..


సోమల: కిట్లను పంపిణీ చేస్తున్న నేతలు


రామకుప్పం: విద్యాకానుక అందజేత


పలమనేరు : బొమ్మిదొడ్డిలో..


కుప్పం రూరల్: విద్యా కానుక కిట్ల పంపిణీ

నేడు రైతు సమావేశం

పుంగనూరు: పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణంలో గురువారం ఉదయం 10 గంటలకు రైతు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్కెట్ కమిటీ తొలి సమావేశంతో పాటు రైతుల సమావేశం కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించి, రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్ఞానప్రసన్న తదితర ప్రజాప్రతినిధులు అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు. రైతులందరు హాజరై జయప్రదం చేయాలని ఏఎంసీ చైర్మన్ కోరారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


తాజ్‌మస్రూర్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

గంగవరం: గంగవరం ఎంపీడీవోగా తాజ్‌మస్రూర్ బుధువారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారిగా, మదనపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించి పదోన్నతిపై గంగవరం వచ్చా రు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేస్తున్న శివప్రసాద్ కడపజిల్లా దువ్వూరు ఈవోఆర్‌డీగా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన తాజ్‌మస్రూర్ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తానని, సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహిస్తానని తెలిపారు. కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయనను సత్కరించి, అభినందనలు తెలిపారు.

సీఐగా నాగార్జునరావు

బంగారుపాళెం: బంగారుపాళెం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐగా నాగార్జునరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా నుంచిఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీఐ నరసింహారెడ్డి వీఆర్‌కు వెళ్లారు.

దేశానికే ఆదర్శంగా జగనన్న పథకాలు


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి ఇంటి ముంగిటకే అందుతున్నాయని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. బుధవారం మండలంలోని బందార్లపల్లె పంచాయతీ పరిధిలోని నక్కబాలేపల్లె, పామనబోయినపల్లె, కంచిదాసనపల్లె, ఎద్దులగట్టు, కోడిగుండ్లపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేశారు. సమస్యలను తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణాకు అనుమతులు ఇవ్వాలని, కాలువలను నిర్మించాలని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్సీ ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అనుసరిస్తున్నారన్నారు. గ్రామాల్లో మహిళలు ఎమ్మెల్సీకి అపూర్వ స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ రాజ్‌గోపాల్, ఎంపీటీసీ సభ్యురాలు సౌమ్య, నేతలు రామకృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, కేశవరెడ్డి, హరినాథ్ రెడ్డి, లక్ష్మణరెడ్డి, బోర్‌వెల్ చెంగారెడ్డి, సుబ్రమణ్యం, సుజాత, మండల అధికారులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీలో మదర్‌థెరిసా ప్రతిభ

గంగవరం: గత మే నెలలో జరిగిన ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో మండలంలోని మదర్‌థెరిసా జూనియర్ కళాశా ల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్టు కరెస్పాండెంట్ రవీంద్రబాబు బుధవారం తెలిపారు. కళాశాలలో చదివిన 150 మంది విద్యార్థులు అర్హత పరీక్షను రాయగా 120 మంది ర్యాంకులు సాధించారన్నారు. ఎంపీసీ గ్రూపులో చంద్రహాస్‌రెడ్డి 2,705 ర్యాంకుతో మొద టి స్థానంలో నిలిచారన్నారు. గోవర్ధన్ రెడ్డి 7,014 ర్యాంకుతో రెండవ స్థానంలో బైపీసీలో షాహిస్తా అజ్మి 7,256 ర్యాంకు సాధించి మూడవ స్థానంలో నిలిచారని తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నగదు పురస్కారాలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని టూ డిపోలోని ఉద్యోగులకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు పురస్కారాలు అందజేశారు. పలు రూట్లల్లో అధిక ఆదాయానికి కృషి చేసిన డ్రైవర్లు రాంబాబు, కందన్, కండక్టర్లు మురళి, నిర్మలను అసిస్టెంట్ మేనేజర్ అల్తాఫ్ నగదు పురస్కారాలతో సత్కరించారు.

వారాహి రోడ్డు ఎక్కేది నారావారి కోసమే..


మాట్లాడుతున్న నాగరాజు

వి.కోట: జనసేన పుట్టిందే చంద్రబాబు కోసమేనని, చంద్రబాబు, రామోజీ కలిసి పెట్టించిన పార్టీనే జనసేన అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో వంగవీటి రంగా హత్య తరువాత కాపులు టీడీపీకి పూర్తి దూరమయ్యారన్నారు. దీన్ని గ్రహించిన రామోజీ, చంద్రబాబు పవన్‌కల్యాణ్‌ను వాడుకోవడానికి స్కెచ్ వేసి జనసేన పార్టీని తెరపైకి తెచ్చారని విమర్శించారు. మొదటి నుంచి జనసేన అధికారం కోసం పనిచేయకుండా చంద్రబాబు మద్దతు కోసమే ఆరాటపడుతోందని పేర్కొన్నారు. లాస్ట్‌టైం ఢిల్లీ వెళ్లినప్పుడు సేవ్ చంద్రబాబు అంటూ అమిత్‌షా దగ్గర మొరపెట్టుకున్న విషయం ఎవరికీ తెలియదా..? ఐదేళ్లకోసారి చంద్రబాబుతో ప్యాకేజీ మాట్లాడుకోవడం ఎవరికీ తెలియదా..? అని ఎద్దేవాచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిస్థితులపై అవగాహన లేని, పోలవరం గురించి పదినిముషాలు కూడా మాట్లాడలేని పవన్‌కళ్యాణ్ వారాహి ఎక్కి బయటకొచ్చేది కూడా ప్యాకేజీలో భాగమేనన్నారు. ఇండియాటుడే సర్వే టైమ్స్ నౌసర్వే ఏ జాతీయ సర్వే చూసినా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాబలానికి తిరుగులేదని చెబుతున్నాయన్నారు

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్టాపన


తిరుపతి గంగమ్మ తల్లి

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీతిరుపతి గంగమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు ఆలయంలో హోమాలు, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు. విగ్రహదాత, వైఎస్సార్‌సీపీ నాయకులు నిడిగుంట ఆంజప్ప దంపతులు, రాయలపేట సర్పంచ్ అరుణ దంపతులు, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొన్నారు.

వేడుకగా తిమ్మరాయస్వామి కుంభాభిషేకం


విశేషాలంకరణలో తిమ్మరాయస్వామి


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: గుడుపల్లె మండలం, గుత్తార్లపల్లెలో వెలిసిన శ్రీప్రసన్న తిమ్మరాయస్వామి ఆలయ కుంభాభిషేకం బుధవారం ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా ప్రత్యేక పూజలు చేసి బుధవారం కుంబాభిషేకం నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణపతిహోమం, నవగ్రహశాంతి, కలశ స్థాపనలు చేపట్టారు. అనంతరం తిమ్మరాయస్వామిని పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి, కుంభాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్సీ భరత్ పాల్గొన్నారు. కుప్పం ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గాలివానతో ట్రాన్స్‌కోకు భారీ నష్టం


గుడిపాలలో నేలవాలిన కరెంటు స్తంభం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో ఇటీవల కురిసిన గాలివానకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయని,భారీ నష్టం వాటిల్లిందని ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. చిత్తూరు నియోజకవర్గంతో పాటు ఆవులకొండ, పెనుమూరు, జీడీనెల్లూరు, పూతలపట్టు, పాలసముద్రం మండలాల్లో మొత్తం 26 విద్యుత్ స్తంభాలు నేలవాలినట్లు వివరించారు. దీంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు 20 ట్రాన్స్‌ఫార్మర్లు, 11 కేవీ డిస్కులు 12, పిన్స్ 14 దెబ్బతిన్నాయని చెప్పారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లత

బైరెడ్డిపల్లె: బాల్య వివాహాలతో శారీరకంగా, మానసికంగా, సామాజికంగా బాధపడాల్సిన పరిస్థితి వస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత పేర్కొన్నారు. తీర్థం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలకు 21 సంవత్సరాలు, బాలురకు 25 సంవత్సరాలు వచ్చిన తరువాతనే తల్లిదండ్రులు వివాహం చేయాలని తెలిపారు. బాల్య వివాహాలు నేరమని, తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని పేర్కొన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు వంద రోజులు పని కల్పించాలి


ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న పీడీ గంగాభవాని

బంగారుపాళెం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని తెలిపారు. మండలంలోని జిల్లేడుపల్లె పంచాయతీలో ఉపాధి హామీ పనులను బుధవారం ఆమె తనిఖీ చేశారు. చిగరగుట్ట నుంచి బీమన్న చెరువు వరకు ఫీడర్ చానల్ పనులు, చెరువు పూడికతీత పనులను పరిశీలించారు. జాబ్‌కార్డులు కలిగిన దివ్యాంగులకు పని కల్పించాలని సూచించారు. సకాలంలో కూలీలకు బిల్లులు చెలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కిరణ్‌కుమార్, ఈసీ గణేష్, ఫీల్డ్‌అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ఉపాధి కూలీలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఉదయం పూట ఎండకు ముందే కూలీలు హాజరుకావాలని స్పష్టం చేశారు. ఇప్పటికే మండలంలో 5 పంచాయతీల్లో పనితీరు మెరుగ్గా లేకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి


రక్తదానం చేస్తున్న దాతలు

చిత్తూరు రూరల్ : ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని డీఐఓ రవిరాజు అన్నారు. నగరంలోని అపోలో మెడికల్ కాలేజీ, సీపీఎఫ్ ఫ్యాక్టరీలో బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. మొత్తం 178 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసరావు, అమరనాథ్, అపోలో నరేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.